## క్లుప్తంగా

### కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ లవన్న, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశా రు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

### నియోజకవర్గానికి చేరుకున్న 108 నూతన వాహనాలు



ఆత్మకూరుకు చేరుకున్న 108 వాహనం

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు 108 నూతన వాహనాలు చేరుకున్నట్లు 108 వాహనాల నిర్వాహకులు కలిముల్లా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తొలివిడతలో 108 నూతన వాహనం ఆత్మకూరుకు చేరుకుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం నూతన 108 వాహనాలను ప్రారంభించారని చెప్పారు. నంద్యాల జిల్లాకు 13 వాహనాలు వచ్చాయన్నారు. ఇందులో వెలుగోడు , బండి ఆత్మకూరు, మహానంది, మండలాలతో పాటు కొత్తపల్లి, పాములపాడు మండలాలు కూడా వాహనాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ వాహనాల్లో అధునాతన వైద్య సేవలు ఉన్నాయని చెప్పారు.

### ఆర్‌బీకే తనిఖీ

వెలుగోడు: మోతుకూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు పరిశీలించారు. పంటల బీమా, పీఎం కిసాన్ ఈకేవైసీ, ఫర్టిలైజర్ ఇండెంట్, సీసీఆర్‌సీ కార్డుల జారీ తదితర విషయాలపై ఆరా తీశారు. గ్రామంలో వేసే పంటలు, గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వచ్చిన దిగుబడులు, ధరలపై రైతులతో చర్చించారు. ఏవో పవన్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

### గ్రావెల్ రోడ్డు పరిశీలన



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

మిడుతూరు: పీరుసాహెబ్ పేట నుంచి నాగలూటి గ్రామానికి వెళ్లే పొలం రస్తా (గ్రావెల్ రహదారి) పనులను క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రనాథరెడ్డి, పీఆర్ డీఈ ధనిబాబు మంగళవారం పరిశీలించారు. పీఆర్ డీఈ మాట్లాడుతూ పీరుసాహెబ్ పేట నుంచి నాగలూటి గ్రామం వైపు వెళ్లే పొలం రస్తాకు (గ్రావెల్ రహదారి నిర్మాణానికి) ఎంపీ నిధుల కింద రూ.30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ ప్రతాపరెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ యోగేష్, కాంట్రాక్టర్ మద్దయ్య పాల్గొన్నారు.

### ఉపాధి కూలీ మృతి



తెలుగు మధుశేఖర్ (ఫైల్ )

మిడుతూరు: ఉపాధి పనికి వెళ్లిన కూలీ పని ప్రదేశంలోనే మృతిచెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తలముడిపి గ్రామానికి చెందిన తెలుగు మధుశేఖర్ (37) మంగళవారం గ్రామం సమీపంలో ఉన్న పంట కాలువలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు చేస్తుండగా కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటీ కూలీలు మిడుతూరు సామాజిక ఆరోగ్యం కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతునికి భార్య మాధవి, కుమారుడు కిరణ్, కూతురు మధు వైష్ణవి ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సామాజిక ఆరోగ్యకేంద్రం వద్దకు చేరుకొని కుటుంసభ్యులను పరామర్శించారు.

### నాటుసారా స్వాధీనం

మహానంది: గాజులపల్లెలోని సినిమా హాల్‌సెంటర్ వద్ద సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, భాస్కర్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి ఎనిమిది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

---

### పైసా ఖర్చు లేకుండా ఆదాయ ధ్రువ పత్రం ఇచ్చారు..



నాపేరు పర్వీని నందికొట్కూరు పట్టణంలోని బైపాస్ రోడ్డులో నివాసముంటాను. పట్టణంలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. పిల్లల చదువులకు ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరమైంది. విషయం వలంటీర్‌కు చెప్పగానే జగనన్న సురక్ష కార్యక్రమంలో పైసా ఖర్చు లేకుండా కుల ధ్రువీకరణ పత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వం అందించింది. గతంలో సర్టిఫికెట్ పొందాలంటే వారం రోజులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. సీఎం వైఎస్ జగనన్న చలువతో సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు ఇంటి వద్దకే సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారు.

### నిమిషాల్లో జనన ధ్రువీకరణ పత్రం



నాపేరు కమలమ్మ, మాది కొత్తపల్లి మండలం ఎదురుపాడు గ్రామం. నా కొడుకు జనన ధ్రువీకరణ పత్రం కోసం జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే నిమిషాల్లో జారీ చేశారు. గతంలో పనుల కోసం 10కిలో మీటర్ల దూరంలో ఉండే మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరిగాను. వారాల కొద్ది తిరిగినా పనులయ్యేవి కాదు. ఉదయం మండల కార్యాలయానికి వెళ్లితే సాయంత్రం వరకు ఆకలితో అలమటిస్తు ఉండాల్సిందే. అధికారులు రాలేదు మళ్లీ రేపు రండీ అని కార్యాలయ సిబ్బంది చెప్పేవాళ్లు. బస్సు చార్జీకి పైసలు లేకపోతే నడిచి ఇంటికి పోవాలి. జగనన్న సీఎం అయిన తరువాత ఊరిలోనే సచివాలయం, వలంటీర్ల ద్వారా అన్ని పనులు జరుగుతున్నాయి.

# పథకాలు ఇంటి వద్దకు చేర్చడమే మా విధానం

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- కరివేనలో 'జగనన్న సురక్ష'
- లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ



మున్సిపల్ కార్యాలయంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, చైర్ పర్సన్ ఆసియా మారూఫ్

ఆత్మకూరురూరల్: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, వాటిని లబ్ధిదారుల ముంగిటకు చేర్చడమే మా విధానం అని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి స్పష్టం చేశారు. ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆకాంక్షలకు మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నవరత్నాల పేరిట పథకాలను అమలు చేస్తూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అవి ఏమేరకు ప్రజలకు అందాయో నేరుగా తెలుసుకునేలా చేశారన్నారు. అందులో కూడా మిగిలిన వారుంటే వారికి లబ్ధిచేకూర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరివేనలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 279 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ జి.శివశంకరరెడ్డి, ఎంపీపీ నల్లకాల్వ తిరుపాలమ్మ, సర్పంచ్ మాణిక్యమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు పట్టణంలో..**

ఆత్మకూరు: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఎస్పీజీపాలెం, కిశన్‌సింగ్‌వీధి సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. త్వరలోనే ఆత్మకూరు మున్సిపల్ నూతన కార్యాలయానికి భూమిపూజ చేయనున్నారని చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే కు మున్సి పల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, కౌన్సిలర్లు, నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజగోపాల్, దివ్య, కౌన్సిలర్లు పార్వతి, కలిముల్లా, పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఉమాదేవి పాల్గొన్నారు.

**గడప వద్దకే పాలన తీసుకొచ్చాం**

వెలుగోడు: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ పాలన ప్రజల గడప వద్ద తీసుకువచ్చామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బోయరేవుల గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో 203 మంది వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా 193 సమస్యలు పరిష్కరించారు. మిగతా 10 దరఖాస్తులకు కూడా వెంటనే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, వెలుగోడు సర్పంచ్ వేల్పుల జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు మాయల మరాఠీ..!



తమ్మడపల్లెలో లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: రోజుకో మాట మారుస్తూ, అధికారం కోసం అమలుకు సాధ్యం కానీ హామీలు ఇస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాయల మరాఠీ, మాయల ఫకీర్ అని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానంది మండలం తమ్మడపల్లె, బండిఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తమ్మడపల్లెలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడు మోసం మాటలు చెప్తారన్నారు. అందరినీ కోటీశ్వరులను చేస్తానని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని, సాధ్యం కావడానికి ఇదేమి రెండున్నర గంటల సినిమానా అంటూ మండిపడ్డారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. మీకు మేలు జరిగితేనే ఓటేయండి అంటున్న మా ముఖ్యమంత్రి సీఎం జగన్ బాటలోనే తాను అడుగుతున్నానని, శిల్పా మీకు మంచి చేసింటేనే ఓటేయండన్నారు. బి.కోడూరులో 679 సర్వీస్ రెక్వెస్టులు రాగా 638 మందికి అందించారని ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. తమ్మడపల్లెలో 471 మందికి గాను 464 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో మహానంది దేవస్థానం చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీ ఆర్ మహేశ్వరరెడ్డి, బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

### అందరి సంక్షేమమే ధ్యేయం



నందికొట్కూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, అధికారులు



కొత్తపల్లిలో లబ్ధిదారురాలికి ధ్రువపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సుధాకర్



పాములపాడులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సర్పంచు భాగ్యమ్మ, అధికారులు



మండ్లెంలో లబ్ధిదారుడికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

నందికొట్కూరు: అర్హులైన అబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు, సేవలను చేరువ చేసి ప్రజల మోముల్లో చిరునవ్వులు చిందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కే. వీ. ఆర్ ఫంక్షన్ హాల్‌లో 3, 4 వార్డుల సచివాలయాలకు చెందిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు చాంద్‌బాషు, జయమ్మ, షేక్ రేష్మా, షేక్ నాయబ్ లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జగనన్న సురక్షలో భాగంగా ఇటీవల వలంటీర్లు ఇంటింటా చేసిన సర్వేలో 799 మందికి టోకెన్లు జారీ చేయగా వారికి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల మైనార్టీ జోనల్ కన్వీనర్ అబుబక్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, సన అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

**సమస్యల సత్వర పరిష్కారం**

ప్రజల సమస్యలను సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి అన్నారు. మంగళవారం పగిడ్యాల మండలంలోని సంకిరేణిపల్లె సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: అర్హులందరికీ వందశాతం పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం మిడుతూరు -2 సచివాలయ పరిధిలోని వెలుగు కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని 1,050 మంది లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, జయలక్ష్మమ్మ, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులైన వారికి ఉచితంగా సర్టిఫికెట్లు**

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైనవారికి ఉచితంగా సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, సర్పంచు షేక్ నాజియా అన్నారు. మంగళవారం మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఎంపీడీఓ మేరి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎదురుపాడు గ్రామంలో అర్హులైన 246 మంది వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ, నాగంపల్లి సొసైటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీ కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రజల నుంచి 212 అర్జీలు వచ్చాయని, ప్రస్తుతం తక్షణమే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు 63 అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచు మేకల బాగ్యమ్మ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, మాజీఎంపీటీసీ చౌడయ్య, కో ఆప్టెడ్ ముర్తుజావలి పాల్గొన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కారార్థమే ..**

జూపాడుబంగ్లా: ప్రజాసమస్యల పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండ్లెం-1 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 650మంది పలు రకాల ధ్రువీకరణ పత్రాలకోసం దరఖాస్తు చేసుకోగా వారిలో 618 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగార్జునరెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, హేమశేఖర్‌రెడ్డి, తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి పాల్గొన్నారు.



మిడుతూరులో లబ్ధిదారురాలికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

---

## ప్రకాశం జిల్లాకు వెళ్లి పింఛన్ అందజేత



ప్రకాశం జిల్లా కుంటలో మేదరి అల్లూరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు రవికుమార్



నంద్యాల ఆసుపత్రిలో నాగన్నకు పింఛను ఇస్తున్న వలంటీర్ ఈశ్వరమ్మ

జూపాడుబంగ్లా: మండల కేంద్రమైన జూపాడుబంగ్లాకు చెందిన సచివాలయం-1 పరిధిలోని వలంటీరు రవికుమార్ ప్రకాశం జిల్లా, కుంట గ్రామానికి వెళ్లి అక్కడున్న మేదరి అల్లూరమ్మ అనే వృద్ధురాలికి మంగళవారం పింఛన్ అందజేయటంతో ఆమె కృతజ్ఞతలు తెలిపింది. జూపాడుబంగ్లాలో ఒంటరిగా ఉంటున్న అల్లూరమ్మ పెద్దకొడుకును చూసేందుకు కుంట గ్రామానికి వెళ్లింది. అక్కడ కిందపడటంతో కాలు విరిగటంతో కొడుకువద్దే ఉంటోంది. విషయం తెలుసుకొన్న వలంటీరు రవికుమార్ మానవతాదృక్పథంతో ప్రకాశం జిల్లా, కుంటకు వెళ్లి ఆమెకు పింఛన్ మొత్తం రూ.2,750లు అందజేశాడు.

**నంద్యాల వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్**

మహానంది: ఎక్కడున్నా పేదల సంక్షేమమే ధ్యేయమంటూ సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు తమ వంతు బాధ్యతలు నిర్వహించారు. మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన బొకు నాగన్న అనారోగ్యంతో నంద్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఈశ్వరమ్మ మంగళవారం నంద్యాల ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తనకు పింఛన్ అందించడం ఆనందంగా ఉందని నాగన్న సంతోషం వ్యక్తం చేశారు.

## వర్షం కోసం గంగమ్మకు పూజలు



గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న రజకులు

మిడుతూరు: మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలోని కాకిలేరు వాగులో ఉన్న గంగమ్మకు సోమవారం రజక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర విశేష పూజలను నిర్వహించిన అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాగశేషులు, చిన్న హుశేనయ్య, లింగన్న, వెంకటేష్, తిరుపాలు, మోహన్, పెద్ద బాలన్న, రామకృష్ణ మహిళలు పాల్గొన్నారు.

### నేడు 'గడప గడపకు మనప్రభుత్వం'

మహానంది: బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలో బుధవారం ఉదయం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ నర్ల సులోచనమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని చెప్పారు.

### డెంగీని నివారిద్దాం



డెంగీ నివారణపై ర్యాలీ చేపడుతున్న దృశ్యం

మిడుతూరు: డెంగీ వ్యాధిని సమర్థవంతంగా నివారిద్దామని మలేరియా నివారణ జిల్లా అధికారి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలపరిధిలోని నాగలూటి గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతోపాటు మన చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కడుమూరు పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ గౌడు, అసిస్టెంట్ మలేరియా అధికారి వరప్రసాదరెడ్డి, ఎస్‌యూఓ కృష్ణారెడ్డి, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో 2022 -23 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్‌జి కిషోర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 7 సీట్లు, బైపీసీ లో 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 10వ తరగతి ప్రథమ శ్రేణిలో ఈ ఏడాది పాస్ అయిన గిరిజన విద్యార్థులు మాత్రమే ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు నేరుగా సున్నిపెంటలోని గిరిజన గురుకుల ప్రతిభాపాఠశాల ప్రిన్సిపల్‌ను కలవాలన్నారు.వివరాలకు సెల్ నెంబర్ 8099172 737, 9177819676 లకు సంప్రదించాలన్నారు.

### అడ్వాన్స్ రిజర్వేషన్‌తో 10 శాతం రాయితీ

ఆత్మకూరు: స్థానిక ఏపీఎస్సార్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు రానుపోను అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకుంటే చార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తామని ఆత్మకూరు ఏపీఎస్సార్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లేప్రయాణికులు ఆత్మకూరు రిజర్వేషన్ కౌంటర్ నందు రాను, పోను టిక్కెట్‌ను అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈ అవకాశం ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

### ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి

మహానంది: ప్రజల ఆరోగ్యానికి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బండిఆత్మకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భావన తెలిపారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేదప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

### సారా విక్రేతలపై కేసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఎస్ఐ ఎన్వీ రమణ హెచ్చరించారు. మంగళవారం పట్టణ సమీపంలో జమ్మి చెట్టు వద్ద నాటు సారా విక్రయిస్తున్న నీలిషికారి ప్రసాద్ నుంచి ఐదు లీటర్లు, నీలిషికారి మంజు నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



సీపీఎం కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటనరసయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ పట్టణ కార్యదర్శి రణధీర్, స్వాములు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్వాములు, రామ్‌నాయక్; మోహన్, విజయ్, ఎలిషా పాల్గొన్నారు.

**అల్లూరి ఆశయాలు కొనసాగిద్దాం**

శ్రీశైలంప్రాజెక్ట్: మన్యం వీరుడు, భారతదేశ స్వాతంత్ర్య పోరాటయోధుడు అల్లూరి సీతారామరావు జయంతిని శ్రీశైలంప్రాజెక్ట్‌లో మంగళవారం నిర్వహించారు. కొమరం భీం ఆదివాసి చెంచుగిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వై.ఆశీర్వాదం, గిరిజన గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రెడ్డప్ప, గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అలాగే తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డు కొమరయ్య జయంతిని కూడా నిర్వహించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహేశ్వరరెడ్డి, శర్మ, బాలు తదితరులు పాల్గొన్నారు.

## 53 మంది ఉపాధ్యాయుల బదిలీ

కొత్తపల్లి: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల నుంచి 53 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లినట్లు ఎంఈఓ శ్రీరాములు మంగళవారం తెలిపారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు మొత్తం 42 ఉండగా ఇందులో 156 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. వారిలో సాధారణ బదిలీలలో భాగంగా 50 మంది ఉపాధ్యాయులు, ముగ్గురు ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారని చెప్పారు. వీరి స్థానంలో 50 మంది ఉపాధ్యాయులు ఇక్కడ విధుల్లో చేరినట్లు తెలిపారు. అదేవిధంగా కొక్కెరంచ ఎంపీయుఎస్‌లో 180 విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారని, ఎదురుపాడు ఎంపీఈఎస్‌లో 107 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని, ఎర్రమఠం ఎంపీపీఎస్‌లో 120 మందికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని వివరించారు. కొక్కెరంచలో 3, ఎదురుపాడు, ఎర్రమఠంలో మరో ఇద్దరి చొప్పున త్వరలో ఉపాధ్యాయులను నియమిస్తామని ఆయన వెల్లడించారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



నెహ్రూనగర్ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్

గోస్పాడు: సచివాలయాల సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఐటీ సెక్రటరీ, జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చే సర్వీసులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

### అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో ఆషాడమాసం మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించారు కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి పాల్గొన్నారు.